ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్
జిల్లా వార్తలు
5
సోమవారం 25 మార్చి 2024


నారాయణపూర్‌కు వస్తున్న ఎల్లంపల్లి నీరు

మళ్లీ ఎత్తిపోతలు ప్రారంభం

గంగాధర, మార్చి 24: ఎల్లంపల్లి ఎత్తి పోతలు తిరిగి ప్రారంభమయ్యాయి. ఆదివారం ఒక మోటర్ ను అధికారులు నడిపించగా నారా యణపూర్ డెలివరీ సిస్టర్న్ నుంచి ఎల్లంపల్లి నీరు రిజర్వాయర్‌కు చేరుకున్నాయి. రిజర్వా యర్‌లో నీటి లెవ ల్స్ పడిపోవడంతో వారం రోజులుగా డి1కు నీరు నిలిపి వేశారు. వార బందీ పద్ధతిలో నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

ఘనంగా కామదహనం


కరీంనగర్ లో కామదహనం వేడుకల్లో ప్రజలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 24: జిల్లా వ్యాప్తంగా ఆదివారం కామదహనం ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు ప్రాంతాలు, కూడళ్ళలో ఆదివారం రాత్రి కామదహనం వేడుకలు ఘనంగా జరిపారు. ఆయా ప్రాంతాల స్థానికులు పెద్ద కర్రలు, చెట్ల బోదెలను పేర్చి దహనం చేశారు. పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. మంకమ్మతోట చార్‌బజార్‌లో కోడూరి శివకృష్ణ ఆధ్వర్యంలో కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్, మాజీ కార్పొరేటర్ మల్లికార్జున రాజేందర్, సురేశ్‌బాబు, వంశీకృష్ణ, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, రమణాచారి, రాజేశ్, సంతోష్ పాల్గొన్నారు. సరస్వతినగర్ కాలనీలో అధ్యక్షుడు అతికం రాజారాం ఆధ్వర్యంలో కాలని సెక్రెటరీ అశోక్‌రావు, కోశాధికారి మైసయ్య పాల్గొన్నారు. భగత్‌నగర్ చౌరస్తాలో వివేకానంద విద్యాసంస్థల చైర్మన్ సౌగాని కొము రయ్య, గుంటి సుధాకర్, రమేశ్, రాజ్‌ప్రభాకర్, పుల్లూరి కిషోర్ పాల్గొన్నారు. ఆదర్శ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా హోలీ పండుగను సోమవారం జరుపుకోనున్నారు. నాలుగు రోజుల ముందునుంచే ఏర్పాట్లు ప్రారంభం కాగా రంగుల అమ్మకాలు మార్కెట్‌లో జోరుగా కొనసాగాయి. యువత, విద్యార్థులు వేడుకను ఘనంగా జరుపుకోవాడానికి సిద్ధమ య్యారు.

జాజిరి ఆట మారింది..

● స్కానర్‌తో డబ్బులు వసూలు చేస్తున్న చిన్నారులు


శంకరపట్నం మండలం తాడికల్‌లో బ్యాండ్, స్కానర్ పట్టుకుని జాజిరి ఆడుతున్న చిన్నారులు

శంకరపట్నం, మార్చి 24: ఒకప్పుడు జాజిరి ఆట అంటే పిల్లలు కోలలు ఆడుతూ ఇంటింటికి తిరిగి డబ్బులు, ధాన్యం జమ చేసుకునే వారు. వారి వద్ద కోలలు, సంచులు తప్పని సరిగా ఉండేవి. ఇప్పుడు రోజులు మారాయి. కోలల స్థానంలో బ్యాండ్ వచ్చింది. సంచుల స్థానంలో స్కానర్ వచ్చింది. ప్రస్తుతం చిల్లర సమస్య ఉండడంతో ఎవ్వరూ డబ్బులు ఇవ్వడం లేదని, అందుకే స్కానర్ తెచ్చుకున్నామని, ఇవ్వాలనుకునే వాళ్లు స్కాన్ చేసి డబ్బులు ఇస్తున్నారని బాలురు అంటున్నారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలకు గ్రహణం వీడేనా?

- హైకోర్టులో స్టే ఎత్తివేసినట్టు సమాచారం
- ఒకటి రెండు రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం
- ఆరేళ్లుగా కోర్టు చుట్టూ ప్రదక్షిణలు
- తాత్కాలిక పాలకవర్గంతో బ్యాంకు కార్యకలాపాలు
- వెంటనే ఎన్నికలు జరిపించాలని సభ్యుల డిమాండ్



కరీంనగర్ టౌన్, మార్చి 24: కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు ఎన్నికలకు గ్రహణం వీడే అవకాశం కనిపిస్తోంది. ఆరేళ్ల క్రితం ఒక సభ్యుడు అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలను నిలిపివేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో న్యాయస్థానం ఎన్నికలపై స్టే విధించింది. అప్పటి నుంచి ఎన్నికలు జరగలేదు. హైకోర్టు ఆదేశాల మేరకు కొత్తగా ఓటరు జాబితాను రూపొందించారు. సహకార చట్టం ప్రకారం ఎన్నికల నియామవళి మేరకు అభ్యంతరాలు లేకుండా చర్యలు తీసుకొని కోర్టులో ఆధారాలను సమర్పించారు. ఇటీవల న్యాయమూర్తులు వాటిని పరిశీలించి ఎన్నికలపై ఉన్న స్టేను ఎత్తివేసినట్లు తెలిసింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు ఒకటిరెండు రోజుల్లో వెలువడే అవకాశాలున్నాయని, కోర్టు ఆదేశాల మేరకు బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు జరుగుతాయని చెబుతున్నారు.

● పాలకవర్గం లేక ఇబ్బందులు

కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకుకు ఓట్ల ద్వారా ఎన్నికైన పాలకవర్గం లేక పోవడంతో స్వయం నిర్ణయాలను తీసుకోలేక బ్యాంకింగ్ రంగంలో నెలకొన్ని పోటీని తట్టుకోలేకపోతోంది. సభ్యులకు, ఖాతాదారులకు మెరుగైన సేవలందించలేకపోతోందని, బ్యాంకును మరింతగా విస్తరించడం లేదని సభ్యులు, ఖాతాదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలకవర్గ ఎన్నికల వెనుక రాజకీయ జోక్యం ఉందని, దీని కారణంగానే ఎన్నికలు జరపడం లేదంటూ సభ్యులు విమర్శలు చేశారు. పర్సన్ ఇన్‌చార్జిగా ఉన్న అధికారులు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణ అధికారులు ఎన్నికలపై హై కోర్టులో స్టేను ఎత్తివేయించేందుకు ప్రయత్నించారు. కోర్టు సూచనల మేరకు బ్యాంకు ఖాతాదారులతో ఓటర్ల జాబితాను రూపొందించడమే కాకుండా మిగిలిన అభ్యంతరాలను లేకుండా చర్యలు చేపట్టారు. ఆర్థిక లావాదేవీలపై ప్రభావం పడకుండా ఉండేందుకు పర్సన్ ఇన్‌చార్జీ కమిటీలతో సమావేశాలను నిర్వహిస్తూ బ్యాంకును ముందుకు తీసుకెళ్లారు.

● 9,500 మంది ఓటర్లు

1980లో స్థాపించిన కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు అనేక ఒడిదొడుకులను, బ్యాంకింగ్ రంగంలో నెలకొన్న పోటీని తట్టుకొని నష్టాల్లో నుంచి గట్టెక్కి లాభాలతో జాతీయ బ్యాంకులు, కార్పొరేట్ బ్యాంకులకు ధీటుగా అభివృద్ధివైపు దూసుకెళ్తున్నది. కరీంనగర్ ప్రధాన కార్యాలయంగా ఉన్న ఈ బ్యాంకుకు జగిత్యాలలో శాఖ ఉంది. బ్యాంకులో దాదాపు 18వేలపైచిలుకు ఖాతాదారులుండగా వారిలో 9,500 మంది ఓటర్లు ఉన్నారు. ఐదు సంవత్సరాలకోసారి 13 మందితో కూడిన పాలకవర్గాన్ని ఎన్నికల ద్వారా ఎన్నుకుంటారు. 2017 సంవత్సరం వరకు పాలకవర్గం అనేక ఆర్థికపరమైన నిర్ణయాలను తీసుకుంటూ రిజర్వు బ్యాంకు నిబంధనల మేరకు ఖాతాదారులకు రుణాలివ్వడం, ఇచ్చిన రుణాలను వసూలు చేయడంతోపాటు డిపాజిట్ల సేకరణలో కూడా లక్ష్యాన్ని చేరుకుంటూ సభ్యులకు లాభాలను పంచిపెట్టింది.

● పలు యత్నాల తర్వాత..

2017 సెప్టెంబరులో ఆనాటి బ్యాంకు పాలకవర్గ పదవీ కాలం ముగియడంతో తిరిగి ఎన్నికలను నిర్వహించేందుకు సహకారశాఖ అధికారి నోటిఫికేషన్ జారీ చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయగా సరిగ్గా ఎన్నికలకు రెండు రోజుల ముందు ఒక సభ్యుడు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని, కొత్త ఓటరు జాబితాను రూపొందించిన తర్వాతనే తిరిగి ఎన్నికలు నిర్వహించేలా చూడాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టు ఎన్నికలను వెంటనే నిలిపివేసి అభ్యంతరాలను తొలగించాలని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు పిటిషనర్ పేర్కొన్న కొన్ని అభ్యంతరాలను పరిష్కరించి తిరిగి ఎన్నికలను నిర్వహించేందుకు 2018 మార్చిలో నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నోటిఫికేషన్‌ను కూడా నిలిపివేయాలంటూ జనార్దన్ అనే సభ్యుడు కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలపై హైకోర్టు స్టే విధించింది. ఇక అప్పటి నుంచి సభ్యులంతా ఎప్పుడెప్పుడా అంటూ ఎన్నికల కోసం నిరీక్షిస్తున్నారు. పిటిషన్ ఉపసంహరించుకొని ఎన్నికలకు, బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని పలుమార్లు పిటిషనర్‌ను సంప్రదించడంతోపాటు అభ్యంతరాలు లేకుండా కొత్తగా ఓటరు జాబితాను తయారు చేసి కోర్టుకు నివేదించడంతో కోర్టు స్టే ఎత్తివేసినట్లు సమాచారం. హైకోర్టు స్టే ఎత్తివేసిన వెంటనే పాలకవర్గ ఎన్నికలను త్వరగా జరిపించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు జూన్‌లో పూర్తయిన తర్వాత జూన్ చివరి వారంలో లేదా జూలైలో పాలకవర్గ ఎన్నికలు జరిపించే అవకాశాలుంటాయని బ్యాంకు సభ్యులు, ఖాతాదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 సోమవారం
సహర్ 4:47 మంగళవారం

తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి

● మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్


మానేరు డ్యాంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్, తదితరులు

కరీంనగర్ టౌన్, మార్చి 24: నగరంలో తాగునీరు, రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోయర్ మానేరు డ్యాం (ఎల్‌ఎండీ)ని ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ కరీంనగర్, మానకొండూర్‌తోపాటు నగర చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటిని అందించే ఎల్‌ఎండీలో నీటి నిల్వలు పడిపోవడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. తన 25 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎన్నడూ మార్చిలో నీటి నిలువలు డ్యామ్‌లో ఇంతగా తగ్గిపోలేదని అన్నారు. ప్రస్తుతం ఎల్‌ఎండీలో 5.3 టీఎంసీల నీరు మాత్రమే నిలువ ఉందని అన్నారు. బీఆర్‌ఎస్ పాలనలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు తాగునీటి అవసరాలను తీర్చిన తర్వాతనే దిగువకు సాగునీరు అందించాలని జీవో ఇచ్చారన్నారు. మిషన్ భగీరథ కోసం ఎల్‌ఎండీలో 13 టీఎంసీల నీరు, మిడ్ మానేరులో 6.5 టీఎంసీల నీరు నిలువలు తగ్గకుండా చూశారని అన్నారు. ప్రస్తుతం డ్యాంలో నీటి నిలువలు పడిపోవడంతో నగరంలో బోరింగ్‌లు కూడా పని చేయడం లేదని, ఇప్పటికే డ్యామ్‌లో డెడ్ స్టోరేజీకి నీటి నిలువలు చేరుకోవడంతో బురదనీరు తాగునీటిలో కలుస్తోందని అన్నారు. బూస్టర్ పంపుసెట్ల ద్వారా తాగునీటిని అందించడం సాధ్యమవడం లేదని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ తెలిపారు. మహిళలు మళ్లీ బిందెలు పట్టుకుని రోడ్లపైకి వచ్చే పరిస్థితి తేవద్దని అన్నారు. జిల్లా మంత్రులు, ముఖ్యమంత్రి వెంటనే స్పందించి దిగువకు నీటి సరఫరాను నిలిపివేయించాలని డిమాండ్ చేశారు. మానేరు డ్యాంలో ఉన్న ఐదు టీఎంసీల నీటికి మరో రెండు టీఎంసీల నీటిని మిడ్ మానేరు నుంచి తెప్పించి కరీంనగర్‌లో ప్రజలకు కనీసం గంటసేపు నల్లా నీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బి వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటోలు నడవక అప్పులు కట్టలేకపోతున్నాం

● బండి సంజయ్‌కుమార్‌కు మొర పెట్టుకున్న ఆటో డ్రైవర్లు


ఆటో నడుపుతున్న బండి సంజయ్‌కుమార్

భగత్‌నగర్, మార్చి 24: ఆటోలు నడవక అప్పులుకట్టలేక పోతున్నామని ఆటో డ్రైవర్లు ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్‌కు మొర పెట్టుకున్నారు. ఆదివారం నగరంలోని సెయింట్‌జాన్స్ స్కూల్ వద్ద ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆటో డ్రైవర్లను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం మంచిదేనని, అదే సమయంలో ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధికి ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆటో డ్రైవర్లు బాధపడాల్సిన అవసరం లేదని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇబ్బందులను తొలగించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆటోను నడుతుపూ ఆటో డ్రైవర్లలో ఉత్సాహాన్ని నింపారు. ఆటో డ్రైవర్లతో కలిసి ఛాయ్ తాగి వారితో మాట్లాడారు.

భగ్గుమంటున్న భానుడు...

● విలవిలలాడుతున్న జనం


మానేరు డ్యాంలో తగ్గిన నీటిమట్టం





కరీంనగర్ టౌన్, మార్చి 24: జిల్లాలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 10 గంటల వరకు 35 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరి పోవడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో మధ్యాహ్నం వేళల్లో జనం లేక రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. రాత్రి 10 గంటల వరకు కూడా వేడి గాలులు వీస్తుండడంతో ప్రజలు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను అధికంగా వినియోగిస్తున్నారు. తప్పనిసరిగా రోడ్లపైకి వస్తే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆదివారం జిల్లాలో 25.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా గరిష్ఠ ఉష్ణోగ్రత 39.3 డిగ్రీలకు చేరుకుంది. జమ్మికుంటలో 39.3, జమ్మికుంట మండలం ధర్మారంలో 39, చిగురుమామిడి మండలం ఇందుర్తిలో 38.2, వీణవంక మండల కేంద్రంలో 38, చొప్పదండి మండలం ఆర్నకొండలో 37.9 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫిబ్రవరి చివరివారం నుంచే ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇటీవల రెండు, మూడు రోజులపాటు తేలికపాటి వర్షాలు కురవడంతో వాతావరణం కొంత చల్లగా మారింది. మళ్లీ శుక్రవారం నుంచి ఎండలు దంచికొడుతున్నాయి. వేసవి ప్రారంభం నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో జిల్లాలోని లోయర్ మానేరు డ్యాం (ఎల్‌ఎండీ), చెరువులు, కుంటలతోపాటు వరదకాలువల్లో నీరు అడుగంటి పోయాయి. భూగర్భజలాలు గణనీయంగా తగ్గి పోవడంతో సాగు, తాగునీటి ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. 24.034 టీఎంసీ సామర్థ్యం కలిగిన లోయర్ మానేరు డ్యాంలో 5.54 టీఎంసీలకు పడిపోయింది. దీంతో నగరంలో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. మార్చి మూడో వారంలోనే ఈ పరిస్థితి ఉంటే ఏప్రిల్, మేలో తాగు, సాగునీటి ఇబ్బందులు తప్పవని ఆందోళన చెందుతున్నారు. మరో ఐదు రోజులపాటు ఎండల తీవ్రత అధికంగా ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, పిల్లలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నార

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మానకొండూర్, మార్చి 24: వీణవంక మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామానికి ఎలుబాక కార్తీక్ (26) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లారెడ్డిపల్లికి చెందిన ఎలుబాక శ్రీనివాస్ అనే వ్యక్తికి ఇద్దరు కుమారులు శివప్రసాద్, కార్తీక్ ఉన్నారు. వీరు కరీంనగర్‌లోని వెల్డింగ్ షాపులో పని చేస్తున్నారు. రెండో కుమారుడు కార్తీక్ వారి బంధువుల అమ్మాయిని పెళ్లి చేసుకుంటానని కుటుంబ సభ్యులకు తెలిపాడు. పెద్దకుమారుడు పెళ్లి అయిన తర్వాత చేస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ నేపథ్యంలో ఆ అమ్మాయికి తల్లిదండ్రులు వేరే పెళ్లి నిశ్చయించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై కార్తీక్ ఈ నెల 22న(శుక్రవారం) మానకొండూర్ మండలంలోని సదాశివపల్లి గ్రామంలోని మామిడితోటలో రాత్రి వేళ పురుగుల మందు తాగాడు. అనంతరం తన అన్నకు ఫోను ద్వారా తెలిపాడు. సంఘటనా స్థలానికి వెళ్లిన అన్న 108లో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. పరిస్థితి విషమించడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కుటుంబ సభ్యుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థులకు తీవ్రగాయాలు

కోనరావుపేట, మార్చి 24: కోనరావుపేట మండలం ధర్మారం గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామానికి చెంది కాసారాపు స్నేహిత్ బీటెక్ చదువుతున్నాడు. అదే గ్రామానికి చెందిన సిరిమల్ల మహేష్ ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. వీరిద్దరు మర్తనపేట నుంచి ధర్మారానికి వెళ్లి ద్విచక్ర వాహనంపై ఇంటికి తిరిగివస్తున్న సమయంలో ధర్మారం దర్గా వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోయారు. తీవ్రగాయాలైన వీరిద్దరిని రాజన్న సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదాన్ని పరిశీలిస్తే బైక్ అదుపు తప్పి పడ్డారా. లేదా ఏదైనా వాహనం తగిలిపడ్డారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

కన్నుల పండువగా నృసింహుడి తెప్పోత్సవం

- డోలోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు



బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో యోగ నారసింహుడి డోలోత్సవం

ధర్మపురి, మార్చి 24: ధర్మపురి శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి (యోగ) తెప్పె, డోలోత్సవాలు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య మధ్యాహ్నం వేళలో ఉత్సవమూర్తులను సేవలపై ఆశీనులు చేశారు. అనంతరం ఆలయం నుంచి బ్రహ్మ పుష్కరిణి (కోనేరు) వరకు తీసుకువచ్చారు. స్వామి వారల సేవలను హంస రూపంలో గల నూతన వాహనం పైన ఉంచి బ్రహ్మ పుష్కరిణి నీటిలో ఐదుసార్లు ప్రదక్షిణాలు చేయించగా అర్చకులు తెప్పోత్సవం జరిపారు. అటు తరువాత స్వామివారల సేవలను బ్రహ్మ పుష్కరిణి మధ్య గల మండపంలోని ఊయలపై ఆశీనులు చేశారు. సాంప్రదాయ రీతిలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు నేతృత్వంలో స్వామి వారల డోలోత్సవం జరిపారు. భక్తులు ఉత్తర ద్వారం గుండా లోనికి ప్రవేశించి స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. బ్రహ్మ పుష్కరిణి అందంగా విద్యుత్ దీపాలతో అలంకరించగా శోభిల్లింది. రాత్రి 10 గంటలవరకు ఉత్సవం కొనసాగింది. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పలువురు ఎస్ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఉత్తర ద్వారం గుండా లోనికి ప్రవేశించి, స్వామి దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ పాల్గొన్నారు.

● పోటెత్తిన భక్త జనం

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ నెల 20 నుంచి జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నర సింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో భక్తి పారవశ్యం ఉప్పొంగింది. భారీగా తరలి వచ్చి భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తులు స్వామి వారల చెంతకు చేరారు. భక్తుల నరసింహ నామస్మరణలు...మహిళల పూనకాలు, విధి విధాన పూజలతో ఆలయాలు కిట కిటలాడాయి. ఉగ్ర నారసింహుని ఆలయం వద్ద వల్లుబండ మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారలకు ప్రీతి అయిన పట్టె నామాలు, కోరె మీసాలు సమర్పించారు. నృసింహుడికి మహిళలు కుంకుమ పూజలు జరిపారు. ఆలయం పక్షాన సుమారు 10 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది తగు సేవలు అందించారు. ఆర్యవైశ్య, నిత్యాన్న సత్రం సంఘం కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రైస్‌మిల్ యజమానులు ఇనుగంటి వేంకటేశ్వర్ రావు, గునిశెట్టి రవీందర్, శ్రీనివాస్, మురికి శ్రీనివాస్, అక్కెనపెల్లి రాజేందర్, సేవలు అందించారు. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో 150 కిలోల పెరుగు, 5,000 మజ్జిగ ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని టీపీసీసీ సభ్యులు సంగనభట్ల దినేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్ ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా డొంకేశ్వరం గ్రామానికి చెందిన వేల్పూరి శ్రీయాన్ అనే రెండేళ్ల బాలుడు తప్పిపోగా పోలీస్ కంట్రోల్ రూమ్ ద్వారా కుటుంబ సభ్యులకు అప్పగించాడు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ ఉదయ్‌కుమార్, పలు వురు ఎస్ఐలు బందోబస్తు నిర్వహించారు.

● నిత్య పూజలు..హోమాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నృసింహ స్వామి దేవాలయంలో ఆస్థాన వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల వద్ద యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు ఆధ్వర్యంలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద నేరెళ్ల విజయ్ స్థాపిత దేవతా, విశ్వక్సేన, గరుడ, నరసింహ హోమాలు, నిత్య హవనం, బలిహరణములు, సుదర్శన హోమాలు ప్రత్యేకంగా జరిపారు.

● రూ. 5,76,704 ఆదాయం

బ్రహ్మోత్సవాల సందర్భంగా నాలగో రోజు ఆలయానికి రూ. 5,76,704 ఆదాయం లభించింది. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 2,05,313, ప్రసాదాలు విక్రయించగా రూ 2,94,000 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ 77,391 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించినట్లు ఈవో తెలిపారు.

● బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సల్లో భాగంగా ఈ నెల 25న సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణి లో శ్రీ కొత్త లక్ష్మీ నరసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శేషప్ప కళా వేదికపై ఉదయం శ్రీ సద్గురు త్యాగరాజ సంగీత ఆరాధనోత్సవాలు ప్రారంభం అవుతాయి. ఉదయం 9 గంటల నుంచి 10 వరకు నగర సంకీర్తన, పూజా కార్యక్రమాలు, కొరిడే రమాదేవిచే త్యాగరాజ జీవిత చరిత్ర ప్రసంగం ఉంటుంది. 11 నుంచి పంచరత్న గానాలు, రాత్రి వేళలో పంచరత్న గానాలు ఉంటాయి. స్థానిక కళాకారులు సంగనభట్ల నరేందర్, సుభాషిణి, కరీంనగర్‌కు చెందిన డాక్టర్ తిరుమలచే భక్తి సంగీత విభావరి, తత్వమసి చంద్రకాంత్ బృందంచే కథక్ నృత్య ప్రదర్శన ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.



ధర్మపురి క్షేత్రంలో పోటెత్తిన భక్త జనం



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో స్వామి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

ప్రాణం తీసిన ఈత సరదా

- పుట్టినరోజు వేడుకలు వచ్చి అనంతలోకాలకు

మల్లాపూర్, మార్చి, 24 : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్ గ్రామంలోని మిత్రుడి పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన సాయమల్ల శివకుమార్ (20)అనే యువకుడు బావిలో మునిగి శనివారం మృతి చెందాడు. ఆదివారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..నిజామాబాద్ జిల్లా మాక్లూరు మండలంలోని ధర్మోరా గ్రామానికి చెందిన శివకుమార్ మండలం లోని చిట్టాపూర్ గ్రామంలోని తన మిత్రుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన డానికి వచ్చాడు. మిత్రులతో కలసి గ్రామ శివారులోని చెరువు సమీపంలోని బావి వద్దకు వెళ్లారు. బావిలోకి ఒకరు తరువాత ఒకరు దుకారు. శివకుమా ర్‌కు ఈత రాకపోవడంతో బావిలో మునిగిపోయాడు. తోటి మిత్రులు ఎంత వెతికిన శివకుమార్ కనిపించకపోవడంతో గ్రామస్థులకు, పోలీసులకు సమచారం అందించారు. సంఘటన స్థలానికి వచ్చిన ఎస్సై కిరణ్‌కుమార్ గజ ఈతగాళ్లతో మృత దేహాన్ని వెలికి బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహాన్ని మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అదిం చారు. మృతుడు సాయమల్ల శివకుమార్ తల్లి భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమతి లేని పేలుడు పదార్థాల స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకుంటున్న పేలుడు పదార్థాలు

చందుర్తి, మార్చి 24: అనుమతులు లేకుండా నిలువ చేసిన జిలిటెన్ స్టిక్స్, కాంప్రెసర్ ట్రాక్టర్‌ను చందుర్తి మండలం రామారావుపల్లి గ్రామ శివారులో పోలీసులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం.. రామారావు పల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో విచ్చలవిడిగా జిలిటెన్ స్టిక్స్ ట్రాక్టర్ సంచరిస్తున్నట్లు సమాచారం మేరకు డ్రిస్టిక్ బాంబ్ స్క్వాడ్‌తో సంఘటన స్థలానికి చేరుకొని తనిఖీలు చేపట్టి 24 డిటోనేటర్స్, 16 స్లారీ కంకులు, రెండు బైండింగ్ వైర్ల కట్టలు, ఒక డైనమా, ఒక ట్రాక్టర్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు, రామారావు పల్లెలో గ్రామానికి చెందిన కొమిరె మల్లయ్య తన కాంప్రెసర్ ట్రాక్టర్‌ను గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో పూడిక తీసేందుకు సిద్ధం కాగా ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అంగరంగ వైభవంగా నర్సింహస్వామి రథోత్సవం



కిషన్‌రావుపేట రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వెల్గటూర్, మార్చి 24: మండలం లోని కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మి నర్సింహస్వామి రథోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని అందంగా అలంకరించిన పీఠంపై రథంలో నిలిపి రథోత్సవం నిర్వహించారు. ఉదయం ప్రాబోధిక, విష్వక్సేన విధి, చతుఃస్థానార్చన, హోమం నిర్వహించారు. సాయంత్రం రథబలి, పుష్పయాగం, ఏకాంతసేవ, గ్రామబలి, రథోత్సవం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారిని రోజుకో రీతిన పూజలు నిర్వహించి, చివరి రోజు రథోత్సవం జరిపారు. స్వామి వారి రథోత్సవం ముందు మహిళలు కోలాటం ఆకట్టుకుంది. భక్తులు రథోత్సవంతో అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిపై బుకా గులాలు చల్లి మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు తరిలి రావడంతో ఆలయాల ప్రాంతం కిక్కిరిసి పోయింది. స్వామి వారికి కొబ్బరి కాయలు కొట్టి చల్లంగా చూడమని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

ఓదెలలో మల్లన్న సన్నిధిలో భక్తుల సందడి

ఓదెల, మార్చి 24: మండల కేంద్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రానికి ఆదివారం మొక్కులను సమర్పించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అదిలాబాద్, మంచిర్యాల, చిట్యాల, మండలాల నుంచి అధికంగా తరలివచ్చిన భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి స్వామివారికి సమర్పించారు. అలాగే మల్లికార్జునస్వామికి బోనాలతో మొక్కులను సమర్పించిన అనంతరం, ఆలయంలో కోడేలతో ప్రదక్షిణ చేసి మొక్కులను సమర్పించారు. అనంతరం ఆలయంలో అర్చనలు నిర్వహించా రు. మరో 15 రోజుల్లో వచ్చే ఉగాది పర్వదినానికి ముందు భక్తులంతా భ్రమరాంబ మల్లికార్జున స్వామిని, మదన పోచమ్మ, బంగారు పోచమ్మలకు మొక్కులను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది.



కోడే మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గు పూజారులు

ఘనంగా స్వామివారల డోలోత్సవం

వేములవాడ, మార్చి 24: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో స్వామివారల డోలోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం రాత్రి శ్రీస్వామివారి కల్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన ఊయలలో శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామి, శ్రీలక్ష్మిఅనంతపద్మనాభస్వామివారల ఉత్సవ విగ్రహాలను ఉంచి డోలోత్సవం నిర్వహించారు. అంతకుముందు ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు శ్రీపార్వతీరాజరాజేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఫంక్షన్‌హాళ్లలో చోరీలకు పాల్పడిన నిందితుల అరెస్ట్

కరీంనగర్ క్రైం, మార్చి 24: ఫంక్షన్‌హాళ్లలో చోరీలకు పాల్పడిన నిందితులను ఆదివారం పోలీసులు అరెస్టు చేశారు. కరీంనగర్ ఖాన్‌పురాకు చెందిన మహమ్మద్ రహీం బొమ్మకల్ ఫ్లైఓవర్ సమీపంలోని ఓ జిమ్ సెంటర్ ట్రైనర్‌గా పని చేస్తున్నాడు. ఆ సెంటర్‌కు ఈత నేర్చుకునేందుకు వెళ్లిన 12 ఏళ్ల బాలుడితో పరిచయం ఏర్పడగా ఇద్దరూ సులువుగా సంపాదించాలని ఉద్దేశంతో ఫంక్షన్‌హాల్స్‌లో దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఫంక్షన్స్ జరిగే ఫంక్షన్ హాళ్ల సమాచారాన్ని రహీం తన స్నేహితుడైన ఆటో డ్రైవర్ మైనస్ బిన్ హదితో తెలుసుకునేవాడు. ఆ ఫంక్షన్‌హాల్స్‌కు రహీం, బాలుడిని తన బైక్‌పై తీసుకువెళ్లేవాడు. రహీం బైక్‌పై బయటే ఉండగా, బాలుడు ఫంక్షన్‌హాల్స్ లోపలికి వెళ్లి శుభకార్యాలకు వచ్చిన అతిథుల హ్యాండ్ బ్యాగ్స్ నుంచి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుని బైక్‌పై పారిపో యేవారు. కరీంనగర్, బొమ్మకల్, అలుగునూర్, హుజురాబాద్‌లోని పలు ఫంక్షన్ హాళ్లలో దొంగతనాలకు పాల్పడి బంగారు ఆభరణాలు, ల్యాప్‌టాప్, డబ్బులు చోరీ చేశారు. ఆభరణాల్లో కొన్నింటిని విక్రయించేందుకు శనివారం వరంగల్‌కు బాలుడు, మైసన్ బిన్ హదిలు కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎల్ఎండీ ఎస్ఐ బి.చేరాలు అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు గ్రాముల బంగారు ఉంగరాలు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, బైక్‌ను స్వాధీన చేసుకున్నారు. నిందితులు ఇద్దరిని రిమాండ్ చేశారు. ముఖ్య నేరస్తుడైన మహమ్మద్ రహీమ్‌ను పట్టుకునేందుకు టాస్క్‌ఫోర్స్ సీఐ రవీందర్, ఎస్‌బీఐ సృజన్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, ఎల్ఎండీ ఎస్సై చేరాలు ఆధ్వర్యంలో 4 బృందాలను ఏర్పాటు చేశారు. దొంగిలించిన బంగారు సొత్తుతో పారిపోదామని మహమ్మద్ రహీం కరీంనగర్ బస్టాండ్‌కు వెళ్తుండగా ఆదివారం జడ్పీ కార్యాలయం ఎదుట పోలీసులు అరెస్టు చేశారు. 150 గ్రాముల బంగారు ఆభరణాలను, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ముగ్గురు నింది తులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎల్ఎండీ ఎస్సై బి చేరాలు, కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి, హెడ్ కానిస్టేబుల్ ఆంజ నే యులు, కానిస్టేబుల్ శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని సీపీ అభినందించారు.



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై చేరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి

అంతర్గాం, మార్చి 24: రామగుండం-పెద్దపేట రైల్వేస్టేషన్ల మధ్య డౌన్‌లైన్ పట్టాలపై ఆదివారం గుర్తుతెలియని రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి(38) మృతి చెందినట్టు జీఆర్‌పీ ఔట్‌పోస్టు ఇన్‌చార్జి జీ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, నలుపురంగు ప్యాంటు, ఎరుపు రంగు టీ షర్టు ధరించాడని, ఇతర వివరాలు ఏమి తెలియరాలేదని తెలిపారు. ముఖంపై, తలపై తీవ్రగాయాలు ఉండడంతో రైలు ఢీకొని, లేక రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నట్టు తెలిపారు. మృతదేహాన్ని గోదావరిఖని ఆసుపత్రిలో భద్రపరిచినట్టు, సంబంధీకులు ఎవరైనా ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్టు తిరుపతి తెలిపారు.

బాలుడు కిడ్నాప్‌నకు యత్నం

- కేసు నమోదు చేసిన పోలీసులు

మానకొండూర్, మార్చి 24: మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన బొల్లబత్తుల కార్తికేయ (11) అనే బాలుడిని ఈ నెల 22న కిడ్నాప్‌కు యత్నించిన వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన రమేశ్ అనే వ్యక్తి చిన్న కుమారుడు కార్తికేయ గ్రామంలో నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ సమయంలో బైక్ పై ఇద్దరు వ్యక్తులు వచ్చి చాక్లెట్ ఇస్తానని చెప్పి క్డిడ్నాప్‌నకు యత్నించారు. బాలుడు భయంతో పరిగెత్తి ఇంటికి చేరుకున్నాడు. ఆదివారం బాలుడి తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కోరుట్లలో చిన్నారుల కిడ్నాప్ కలకలం

- ఫైనాన్స్ రికవరీకి వచ్చిన వ్యక్తులుగా గుర్తించిన పోలీసులు



కాలనీలో గుమిగూడిన స్థానికులు

కోరుట్ల, మార్చి 24 : పట్టణంలోని సాయిరాం పుర కాలనీలో వేకవజామున చిన్నారుల కిడ్నాప్ ఉదంతం కలకం రేపింది. కాలనీలో వేకవజామున ఇంటి బయట ఆటలు ఆడుకుంటున్న చిన్నారులను ద్విచక్ర వాహనపై ఎక్కించుకుని పాఠశాల అడ్రస్ చూపాలని సదరు వ్యక్తులు కోరగా అడ్రస్ చూపడానికి చిన్నారులు ద్విచక్ర వాహనం ఎక్కారు. పక్కనే ఉన్న వారు పిల్లలను ఎక్కడకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించడంతో సదరు వ్యక్తులు పిల్లలను దించి వెళ్లిపోయారు. అనుమానం వచ్చిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన కోరుట్ల ఎస్ఐ కిరణ్ కుమార్ తమ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ద్విచక్ర వాహనంపై ఎక్కిన బోమ్మెన విశ్వేష్ (8), బోమ్మెన విఙ్ఞేష్ (9)లను జరిగిన విషయంపై పోలీసులు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ప్రాంతంలో ఓ ఇంట్లో అద్దెకుంటున్న సిద్దు అనే వ్యక్తి గురించి ఇద్దరు వ్యక్తులు నంబర్‌లేని ద్విచక్ర వాహనంపై వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. సదరు ఇంటి యజమాని వారు ఎందుకు వచ్చినట్లు ఆరా తీయగా ఇంటిలో కిరాయికి ఉంటున్న వ్యక్తి బ్యాంకులో రుణం తీసుకుని బాకీ ఉన్నట్లు వచ్చిన వ్యక్తులు వివరించినట్లు తెలిసింది. ప్రైవేట్ బ్యాంకులో రికవరీ చేసే బ్యాంక్ సిబ్బందిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కాలనీకి వచ్చిన వ్యక్తులు వేకవజామున నంబర్ లేని వాహనంతో పాటు నైట్ ప్యాంట్ ధరించి రావడంతో కాలనీ వాసులు అనుమానించారని ఎస్ఐ తెలిపారు. విషయం పూర్తిగా తెలియకుండా సోషల్ మీడియాలో ప్రచారం చేయడంతో కాలనీ వాసులు అసహనం ప్రదర్శించారు.

ద్విచక్ర వాహనం దహనం

తంగళ్లపల్లి, మార్చి 24: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి ద్విచక్ర వాహనంతో తనకు నష్టం వాటిల్లుతోందని కోపోద్రిక్తుడైన ఓ యువకుడు బైక్‌ను దహనం చేశాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. సిద్దిపేట జిల్లా చేర్యాలకు చెందిన హరి ద్విచక్ర వాహనంపై వేములవాడకు బయలుదేరాడు. ఈ క్రమంలో సిద్దిపేట శివారులో ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అదే వాహనంపై వేములవాడకు వెళ్తున్న క్రమంలో సహనం కోల్పోయి నేరెళ్ల శివారుకు చేరుకోగానే రోడ్డు పక్కన ద్విచక్ర వాహనాన్ని నిలిపి తగులబెట్టాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

-ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్



మాట్లాడుతున్న ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి 24: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని శాతవాహన ఉప కులపతి ఆచార్య సంకసాల మల్లేష్ అన్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూని వర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఏడు రోజుల రీసెర్చ్ మెథడాలజీ కోర్స్ సెమినార్స్ ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఇలాంటి రీసెర్చ్ మెథడాలజీ కోర్సులు రీసెర్చ్ స్కాలర్లకి చాలా ఉపయోగపడతాయన్నారు. ఆచార్య చన్న బసవయ్య మాట్లాడుతూ సమాజంలో ఉన్న సమస్యలకు రీసెర్చ్ ద్వారా సమాధా నాలు వెతికే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమ డైరెక్టర్ డా.ఎస్.వి.శ్రీరంగప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి కోర్సు నిర్వహించ డానికి తనను ప్రోత్సహించిన శాతవాహన అధికారు లను, కోర్సులో చేరి విజయవంతం చేసినటువంటి రీసర్చ్‌స్కాలర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో కోర్సు కో డైరెక్టర్ డాక్టర్ ఈ మనోహర్, బిజినెస్ మేనేజ్‌మెంట్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం.మనోజ్‌కుమార్, కృష్ణకుమార్, డాక్టర్ కే తిరుపతి, అజీజ్, విజయ్ సావిత్రి, ఇతర అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌కు సన్మానం



మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న నాయకులు

రామడుగు, మార్చి 24: రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరేళ్ల శారదకు ఆదివారం ఘన సన్మానం చేశారు. మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా నియమితులై మొదటి సారిగా మండలంలోని తన స్వగ్రామమైన వెదిర గ్రామానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామంలోని వేంకటేశ్వర, మార్కండేయ, రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోల రమేశ్, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుడ్ల భవాని, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'సెయింట్ జార్జ్'లో గ్రాడ్యుయేషన్ డే



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సెయింట్ జార్జ్ చైర్మన్ ఫాతిమారెడ్డి

కరీంనగర్‌రూరల్, మార్చి24: కొత్తపల్లిలోని సెయింట్‌జార్జ్-సిబిఎస్‌ఈ ఇంటర్నేషనల్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి, ప్రిన్సిపాల్స్ భార్గవ్, నిరంజన్, అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రముఖ వాఖ్యత మాడిశెట్టిగోపాల్, ప్రముఖ చిత్రకారుడు అన్నవరం శ్రీనివాస్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెయింట్ జార్జ్ నినోస్‌బ్లాక్ రేకుర్తి, విద్యానగర్ సంస్థల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సీనియర్ కేజీ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో నినోస్‌బ్లాక్ ఇన్‌చార్జిలు సంగీత, సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఇంగ్లీష్ మెటీరియల్ విడుదల



ఇంగ్లీష్ నోట్స్‌ను ఆవిష్కరిస్తున్న వివేకానంద ప్రిన్సిపాల్ శ్రీనివాస్

గణేశ్‌నగర్, మార్చి 24: జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలలో సీనియర్ ఆంగ్ల అధ్యాపకుడిగా పనిచేస్తున్న హమ్ వ్యవస్థాపకులు ధనపురి సాగర్ తయారు చేసిన డిగ్రీ 6వ సెమిస్టర్ నోట్స్‌ను కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఈ నోట్స్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆంగ్ల అధ్యాపకుడు ధనపురి సాగర్ మాట్లాడుతూ తమ సంస్థ పక్షాన ఈ నోట్స్‌ను ఉచితంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఏసిఓ బి.సంపత్ కుమార్, ఏవో బి.శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

'సాగు, తాగు నీటి ఇబ్బందులను పరిష్కరించాలి'

కరీంనగర్ టౌన్, మార్చి 24: సాగు, తాగు నీటి ఇబ్బందులను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని కరీంనగర్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కోరారు. కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగాయనే సాకుతో ప్రాజెక్టులను ఎడారిగా మార్చి రైతుల నోట్లో మట్టికొడుతోందని విమర్శించారు. ఆదివారం ఎల్‌ఎండీ ఆనకట్ట వద్ద ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ యాదగిరి సునీల్‌రావుతో కలిసి మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈసందర్భంగా బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రైతు రాజ్యం తెస్తామన్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతులను కన్నీరు పెట్టిస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో మానేరు వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆనందం, నర్సింగారావు, విద్యాసాగర్‌రెడ్డి, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, దిండిగాల మహేశ్, అయిలేందర్‌యాదవ్, తోట రాములు, నాయకులు సిద్దం వేణు, ఏవి రమణ, జక్కుల నాగరాజు యాదవ్, కర్ర సూర్యశేఖర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ రుసుమును తగ్గించాలి

కరీంనగర్ టౌన్, మార్చి 24: కాంగ్రెస్ ప్రభుత్వం టెట్ పరీక్షా రుసుమును వేయి, రెండు వేలకు పెంచడం దారుణమని, పెంచిన రుసుమును వెంటనే తగ్గించాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరమ్ ఉమ్మడి జిల్లా డిమాండ్ చేసింది. ఆదివారం ఈ సందర్భంగా టిఎల్ఎఫ్ రాష్ట్ర సమన్వయ కర్త పోకల నాగయ్య మాట్లాడుతూ గత సంవత్సరం వరకు టెట్ పేపర్ ఒకదానికి 200, రెండు పేపర్లకు 300 ఉండేవని, కాంగ్రెస్ ప్రభుత్వం టెట్‌కు దరఖాస్తు చేసుకునే ఈ ఫీజులను అమాంతం వేయి, రెండు వేలకు పెంచిందని ఆవేదన చెందారు. ఎండాకాలంలో జీతాలు లేని సమయంలో ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లు ఇంత ఫీజు చెల్లించేందుకు ఇబ్బంది పడుతారని, పెంచిన రుసుమును తగ్గించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టిఎల్ఎఫ్ రాష్ట్ర నాయకులు పెద్దిరాజు సత్యనారాయణ, ముత్తోజు సదానందచారి, ఎండి గఫూర్, ఎండి తాజొద్దీన్‌బాబా, బొంగిని రాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శంకరపట్నం, మార్చి 24: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-95లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం మొలంగూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు తమకు పాఠాలు చెప్పిన గురువులు తాటిపల్లి రామయ్య, కాసు అయిలయ్య, కాళిదాస్‌లను పూర్వ విద్యార్థులు సత్కరించారు. చిన్ననాటి జ్ఞాపకాలను తోటి స్నేహితులతో పంచుకుంటూ ఆటాపాటలతో అలరించారు.

ఆర్యవైశ్య సంఘం ప్రమాణస్వీకారం

హుజూరాబాద్, మార్చి 24: హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో ఆదివారం పట్టణ ఆర్యవైశ్య, యువజన సంఘం పట్టణ కార్యవర్గం ప్రమాణస్వీకారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు చందా రాజు, ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఆర్యవైశ్య పట్టణాధ్యక్షుడిగా సుద్దాల హరిశంకర్, ప్రధాన కార్యదర్శిగా నూక శ్రీనివాస్, యువజన సంఘం అధ్యక్షుడిగా కొడితే నాగరాజు, కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, సతీష్, శ్రీనివాస్, శ్రీకాంత్, పున్నంచందర్, క్యాస చక్రధర్, వేణుగోపాల్, రాజన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

ఘనంగా మహా సుదర్శన హోమం

జమ్మికుంట, మార్చి 24: జమ్మికుంట పట్టణంలోనని శ్రీఅయ్యప్పస్వామి ఆలయం 25వ వార్షికోత్సవ ద్వితీయ పుష్కర మహా కుంభాభిషేక మహోత్సవంలో భాగంగా మహా సుదర్శన హోమం కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ వెంకటేశ్‌శర్మ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, నవచండీ హోమాలు చేపట్టారు. కార్యక్ర మంలో ఆలయ అధ్యక్షుడు జయేందర్, రాజేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తిమ్మాపూర్, మార్చి 24: మండలంలోని మొగిలిపాలెం గ్రామంలో గల శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి వారి 120వ అధ్యయన బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ స్వామి వారి కల్యాణం అర్చకులు కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. అనంతరం శకటోత్సవంలో భాగంగా ఆలయం చుట్టు బండ్లు తిరిగే కార్యక్రమం నిర్వహించారు. స్వామి వారి రథంపైకి నారదాసు ప్రవంతి వసంతరావు ఆధ్వర్యంలో 80వేల రూపాయలతో నిచ్చేనను తయారు చేసి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం వేడుకలు



కరీంనగర్‌లో, గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో ఊరేగింపులో పాల్గొన్న క్రైస్తవులు

కరీంనగర్ కల్చరల్, మార్చి 24: క్రైస్తవులు ఆదివారం ఘనంగా మట్టల ఆదివారాన్ని జరుపుకున్నారు. సీపీ కార్యాలయం ఎదురుగా గల వెస్లి కెథిడ్రల్, క్రిస్టియన్ కాలనీలోని సెంటినరీ వెస్లి చర్చ్‌ల నిర్వాహకుల ఆధ్వర్యంలో నగర సంకీర్తన జరిపారు. చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు జరుగగా మత పెద్దలు సందేశాలిచ్చారు. క్రైస్తవులు మట్టలను పట్టుకొని గీతాలు పాడుతూ ఏసు నామస్మరణలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వెస్లి కెథిడ్రల్ చర్చ్ పాస్టరేట్ చైర్మన్ పాల్ కోమల్, మధుమహన్, దేవదాస్, కమిటీ సభ్యులు, సెంటినరీ వెస్లి చర్చ్ పాస్టరేట్ చైర్మన్ ఎస్ జాన్, కార్యదర్శి నారాయణ, కోశాధికారి సంజయ్, కమిటీ సభ్యులతో పాటు క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

●గంగాధర:యేసు క్రీస్తు శిలువ వేయబడడానికి ఊరేగింపుగా తీసుకెళ్లిన రోజును పురస్కరించుకుని మండలంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈసందర్భంగా క్రైస్తవులు ఆయా గ్రామాల్లో ఈత మట్టలను పూలతో అలంకరించి జయహో అంటూ ఊరేగించారు. వీధుల్లో క్రీస్తు కీర్తనలు పాడుతూ ప్రవచనాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పాస్టర్లు దర్మతేజ, దర్మ చైతన్య, యాది ప్రకాశ్, పీటర్, ఇమ్మనుయేలు తదితరులు పాల్గొన్నారు.

నేడు యజ్ఞవరాహ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 24: నగరంలోని యజ్ఞవరాహక్షేత్రంలో ఉత్తర ఫల్గుణి నక్షత్రం-మహాలక్ష్మీ అమ్మవారి జయంతి సందర్భంగా సోమవారం ఆలయంలో ఉదయం 8గంటల నుంచి మహాలక్ష్మీ యజ్ఞవరాహస్వామికి విశేష ఆస్థానం నిర్వహిస్తున్నట్లు సర్వవైదిక సంస్థానం మేనేజింగ్ ట్రస్టీ శ్రీభాష్యం వరప్రసాదశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు వేయి సంవత్సరాలకు పూర్వం భగవద్రామానుజులు అమ్మవారి ద్వారా స్వామివారిని శరణాగతి చేసిన శరణాగతి, శ్రీరంగ, శ్రీవైకుంఠ గద్యాలను విన్నపం చేయనున్నామని పేర్కొన్నారు. భక్తులు పాల్గొని తరించాలని కోరారు.

'మంత్రి పొన్నంను విమర్శించే స్థాయి కౌశిక్‌రెడ్డికి లేదు'

కరీంనగర్ అర్బన్, మార్చి 24: ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయిలేదని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ఒక ప్రకటనలో అన్నారు. ఎన్నో సందర్భాలలో వివాదాస్పదమైన వ్యాఖ్యలు మాట్లాడిన కౌశిక్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్టుందని అన్నారు.

కేసీఆర్ నియంత పాలనలో అప్పటి ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు కనీస గౌరవం ఇవ్వని వీళ్లు ఇప్పుడు అధికారం కోసం ఆరాటపడడం విడ్డూరంగా ఉందని అన్నారు. స్థాయికి మించి విమర్శలు చేస్తే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని నరేందర్ రెడ్డి హెచ్చరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలో ఎవరి సత్తా ఎంతో తేలిపోతుందని, పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పార్టీ మనుగడనే ప్రశ్నార్థకంగా మారబోతోందని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సుభాష్‌నగర్, మార్చి 24: జిల్లా కేంద్రలోని మంకమ్మతోటలో గల దన్గర్‌వాడీ పాఠశాలలో కలిసి చదువుకున్న విద్యార్థులు కలిసి ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఆదివారం నగరంలోని గోదాంగడ్డలోని మనీష్ ఫంక్షన్ హాలులో 1996 నుంచి 2001 వరకు చదువుకున్న విద్యార్థులందరు కలుసుకొని మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులు మల్లారెడ్డి, ఖదీర్, వెంకటరామరాజు, సుధాకర్‌రెడ్డి, మహేందర్ రావు, పి వెంకటరెడ్డి, గోవిందరావు, జాన్, ఉమేష్, ప్రమీల, రమాదేవి, రత్న, శారద, సుమేలను సన్మానించారు. తమతో చదువుకొని ఇబ్బందుల్లో ఉన్న మిత్రులను అందరు కలిసి ఆదుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు పి.సుజాతరెడ్డి, మాధవి, శిరీష, భిక్షపతి, శ్రీధర్, నవీన్, కోటి, రమేశ్, లలిత్, శ్రీనివాస్, శ్రీలత పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి'

కరీంనగర్ టౌన్, మార్చి 24: నగరంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ అధికారులకు సూచించారు. నగరంలో రెండురోజులుగా తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్నందున ఎల్ఎండీ నుంచి సిరిసిల్లకు వెళ్ళే నీటి సరఫరా చేస్తున్న పైపులైన్‌ను కరీంనగర్‌కు పూర్తిగా మళ్ళించి తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆదివారం ఆయన ఎల్ఎండీని సందర్శించి డ్యాం నుంచి రా వాటర్‌ను తీసుకొని ఫిల్టర్‌బెడ్‌లో శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. నగర ప్రజల అవసరాల మేరకు నీటి నిలువలుండేలా చర్యలు చేపట్టేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంపై ఆయన అభినందించారు.

ప్రజల ఆదరణ చూసి ఓర్వలేకనే మంత్రి పొన్నంపై విమర్శలు

-టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్



మాట్లాడుతున్న వైద్యుల అంజన్‌కుమార్

కరీంనగర్ అర్బన్, మార్చి24: మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణ ఓర్వలేకనే ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు చేస్తున్నారని టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. డీసీసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ముందు ఉనికిని చాటుకునే ప్రయత్నంలో భాగంగానే ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌశిక్‌రెడ్డి పదవుల కోసం అధికార వ్యామోహంతో ఇప్పటికే మూడు పార్టీలు మారారన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో పార్లమెంటు సాక్షిగా తన ఆవేశాన్ని చూపించాడన్నారు. ఆయన హయాంలో తిరుపతి రైలు, మాత శిశు కేంద్రం, ఎఫ్ఎం రేడియో, కేంద్రీయ విద్యాలయం, జేఎన్ఎంయూ బస్సులు లాంటి అభివృద్ధి జరిగిందన్నారు. యువకుడైన పొన్నం ప్రభాకర్ పార్లమెంటు సాక్షిగా చేస్తున్న పోరాటాన్ని నాడు కేసీఆర్ అభినందించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంపై దాడి జరిగినప్పుడు, ప్రజలకు అన్యాయం జరిగినప్పుడు, పొన్నం ప్రభాకర్ తన ఆవేశాన్ని చూపిస్తారు తప్ప సామాన్యులపై ఎన్నడూ ఆ విధంగా ప్రవర్తించ లేదన్నారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిగా, డీసీఎంఎస్ చైర్మన్‌గా, మార్కెఫెడ్ చైర్మన్‌గా, పార్లమెంటు సభ్యునిగా ఎన్నికై ఎంపీల ఫోరం కన్వీనర్‌గా ఎన్నికై కష్ట కాలంలో పార్టీని విడకుండా కార్యకర్తలకు పార్టీకి విధేయుడుగా పనిచేసి నేడు మంత్రిగా ఎదిగారన్నారు. ఏనాడు పార్టీలు మారలేదని, మచ్చలేని మనిషి పొన్నం ప్రభాకర్ అన్నారు. మరొకసారి అనవసర ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మోసేన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సిరాజ్ హుస్సేన్, చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ నాయకులు పాండురాల లింగమూర్తి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వరద కాలువకు నీరు విడుదల చేయాలి

- ఆందోళనకు సిద్ధమైన రైతులు - ఎమ్మెల్యే హామీతో విరమణ



ఎమ్మెల్యేకు ఫోన్‌లో సమస్యను వివరిస్తున్న రైతు

గంగాధర, మార్చి 24: వరద కాలువకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని ఆదివారం రైతులు డిమాండ్ చేశారు. కరీంనగర్, నిజామాబాద్ జాతీయ రహదారి కురిక్యాల బ్రిడ్జి వద్ద రామడుగు, గంగాధర మండలాల రైతులు ఆందోళన చేపట్టేందుకు సిద్ధమ య్యారు. సమాచారం మేరకు ఎస్సై కిరణ్‌రెడ్డి అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పంటలు ఎండిపోతుండగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాలు, గింజ గట్టి పడుతుండగా నీరు అవసరముంటుందని రైతులు పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న చొప్పదండి సీఐ ప్రకాశ్‌గౌడ్‌తో పాటు పలువురు రైతుల పరిస్థితిని ఎమ్మెల్యే సత్యం దృష్టికి తీసుకెళ్లారు. రాత్రి 10 గంటలకు వరద కాలువకు నీరు విడుదల చేయిస్తానని ఎమ్మెల్యే సత్యం హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. రైతులు ఆందోళన చేపడితే శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా కరీంనగర్ నుంచి ఎస్సై కిరణ్‌రెడ్డి బలగాలను రప్పించారు. కార్యక్రమంలో కురిక్యాల, కొండన్నపల్లి, ఆచంపల్లి, గర్షకుర్తి, బోయినపల్లి మండలం విలాసాగర్, రామడుగు మండలం షానగర్ రైతులు పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల చేయాలి

గంగాధర, మార్చి 24: వరద కాలువకు వెంటనే నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన కొండన్నపల్లిలో వరద కాలువను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వరద కాలువలో ఏడాది పొడుగునా నీరుండేదన్నారు. ప్రస్తుతం ఎండిపోయి రైతులు సాగు నీటికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రెండు రోజుల్లో వరద కాలువకు నీరు విడుదల చేయకుంటే ఆందోళన చేపడతామని తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌కంకణాల విజేందర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అవయవదాన కుటుంబానికి ప్రశంసాపత్రం

శంకరపట్నం, మార్చి 24: బ్రెయిన్ డెడ్‌తో మృతి చెంది అవయవదానం చేసిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ మేరకు శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన గాజుల రమాదేవి-శ్రీనివాస్ తనయుడు గాజుల నందన్ ఈ నెల 12న సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గాజుల నందన్ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి యాజమాన్యం సహకారంతో గాజుల నందన్ అవయవాలను జీవన్‌దాన్ సంస్థకు అందజేశారు. ఆదివారం వారి స్వగృహంలో వారి కుటుంబ సభ్యులను జీవన్‌దాన్ పీఆర్వో మహి పాల్, సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి అవయవాల మార్పిడి సమన్వయకర్త ప్రశాంత్, గాజుల శ్రీనివాస్, రమాదేవి, నయన ప్రశంసాపత్రం అందజేశారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

చొప్పదండి మార్చి 24: చొప్పదండిలోని సిద్ధార్థ స్కూల్ వార్షికోత్సవ వేడుకలను పురస్క రించుకుని ఆదివారం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు

మానకొండూర్, మార్చి 24: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో సోమవారం నుంచి ఏప్రిల్ 3 వరకు రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు గౌడ సంఘం నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న ఎల్లమ్మ పట్నాలు, 31న పోచమ్మ బోనాలు, ఏప్రిల్ 2న ఎల్లమ్మ బోనాలు, 3న నాగవెల్లి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. మానకొండూర్, శ్రీనివాస్‌నగర్, సదాశివపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు

చెక్‌డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలి

జమ్మికుంట రూరల్, మార్చి 24: జమ్మికుంట మండలం విలాసాగర్ మానేర్‌లో నిర్మించిన చెక్ డ్యామ్‌కు మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే విజయ రమణారావును పెద్దపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి కాంగ్రెస్ నాయకులు ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే మరమ్మతులు చేయిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచపల్లి సమ్మయ్య, వార్డు సభ్యులు గరిగంటి శ్రీధర్, నాయకులు రాచపల్లి సాగర్, రాచపల్లి శ్రీనివాస్, మోరె శివ, రాచపల్లి కుమార్, సిరిశేటి శ్రీను, నెల్లి శ్రీను, వేల్పుల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వంతెన

- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థకు చేరిన వంతెన

చొప్పదండి, మార్చి 24: చొప్పదండి శివారులో డి-86 కాలువపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. కాలువ నిర్మాణ సమయంలో సుమారు నలభై ఏళ్ల క్రితం ఈ వంతెనను నిర్మించారు. ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. చొప్పదండి మున్సిపల్ రెండో వార్డు పరిధిలోని తొగురుమామిడి కుంటకు పట్టణం నుంచి ప్రజలు ఏ వైపునకు వెళ్లాలన్నా ఈ వంతెనను దాటాల్సి ఉంటుంది. కాగా ఈ ప్రాంతంలో రైస్ మిల్లులు సైతం ఉన్నాయి. నిత్యం భారీ వా హనాలు రాకపోకలు కొనసాగి స్తుండడంతో వంతెన దెబ్బతిన్నది. అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, మార్చి 24: నగరంలోని హనుమాన్‌నగర్‌లో మహారాష్ట్రకు చెందిన బీమ్‌రావు కర్‌పటే (34) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మహారాష్ట్రలోని నాందెడ్ జిల్లా జారుర్ గ్రామానికి చెందిన కర్‌పటే 2008లో మనిషా రాజు అనే మహిళతో వివాహం జరిగింది. గంజాయికి బానిస అయి కరీంనగర్‌లోని ఒక హోటల్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం హనుమాన్‌నగర్‌లోని మధురవిలాస్ కాలనీలోని వాచ్‌మెన్‌రూం సమీపంలోని చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు అతడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 24: మానకొండూర్ శివారులోని మానేరు వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను వన్ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం బురికి శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు తిరుమల్‌నగర్‌లో రవి అనే వ్యక్తిని పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సన్మానం

కరీంనగర్ రూరల్, మార్చి 24: బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా నియమితులైన కొండేటి శ్రీధర్‌ను బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జాడి బాల్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కుమ్మరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సుడా చైర్మన్‌కు అభినందనలు

కరీంనగర్ అర్బన్, మార్చి24: సుడా చైర్మన్‌గా నియామకమైన కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మొగిలి లక్ష్మణ్ ఆధ్వర్యంలో సంఘ నాయకులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. సుడా చైర్మన్‌కు కలిసిన సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘం నాయకులు కాసారపు పర్శరాం, రాజన్న, తిరుపతి, మహేందర్, రాజు తదితరులున్నారు.

కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలి

గణేశ్‌నగర్, మార్చి24: కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం పాటించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డొగ్గలి శ్రీధర్ అన్నారు. ఆదివారం మంకమ్మతోటలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ టికెట్ కేటాయింపులో కార్పొరేషన్ చైర్మన్‌లలో, ఉన్నత పదవులలో బీసీ ఎస్సీ ఎస్టీ లకు జనాభా దామాషా ప్రకారం కేటాయించాలని, సామాజిక న్యాయం పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల జనాభా అధికంగా ఉన్న నియోజకవర్గాలలో సీట్లు కేటాయించాలని కోరారు. బీసీలను రాజకీయంగా అణచివేయాలని చూస్తే ఊరుకోబోమని ఆయన హెచ్చరించారు.

అనాథ పిల్లలకు ఆర్థిక సహాయం

కరీంనగర్ టౌన్, మార్చి 24: తెలుగు అధ్యాపకుడు బలుగూరి మహేందర్‌రావు కుమారుడు హర్షవర్ధన్ ఏడేళ్ళ క్రితం మృతిచెందగా ఆయన జ్ఞాపకార్థం అనాథ పిల్లలకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారు. ఆదివారం ఇంటర్మీడియట్ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు అధికా రుల చేతుల మీదుగా నగరంలోని కేర్ నియో హెల్పిం గ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలోని అనాథ పిల్లల ఆశ్రమానికి పది వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ రవీందర్‌రెడ్డి, ఆంజనేయరావు, సత్యనారాయణాం జనేయులు, అధ్యాపకులు దేవేందర్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

వాకర్స్ కమిటీకి సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 24: నగరంలోని పివిఎస్ఆర్ వాకర్స్ అసోసియేషన్ కమిటీని 303 వాకర్స్ అసోసియేషన్ డిప్యూటీ గవర్నర్ గొట్టిముక్కుల రవీందర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆదివారం విద్యానగర్‌లోని పీవీఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు హనుమాండ్ల రఘుపతిరెడ్డి, కార్యదర్శి కొండ రవీందర్, ఉపాధ్యక్షులు కర్ర సత్యనారాయణరెడ్డి, పోలోజు రవీందర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గుడిపాటి రమణారెడ్డి, బూర జగదీశ్వర్‌గౌడ్, సుమన్, రఘునందన్‌రాజు, ఎర్రం శ్యాంసుందర్‌రెడ్డి, మహేశ్, కార్పొరేటర్ కచ్చు రవి, శ్రీనివాస్, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

'మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సహించం'

గన్నేరువరం, మార్చి 24, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ బీసీ సెల్ మండల అధ్యక్షుడు మార్గం మల్లేశం అన్నారు. స్థానికంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటంలో పొన్నం ప్రభాకర్ సేవలు అభినందనీ యమని కొనియాడారు. ఎంపీ పదవిని లెక్క చేయకుండా రాజీనామా చేసి పార్లమెంట్‌లో పెప్పర్ స్ప్రే దాడులను సైతం ఎదుర్కొన్నారని తెలిపారు.

'కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి'

హుజూరాబాద్, మార్చి 24: హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సొల్లు బాబు ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మాటి మాటికి మంత్రి పొన్నం ప్రభాకర్ ను విమర్శించే స్థాయి నీకు లేదని తెలిపారు. అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసి హుజూరాబాద్ ఎమ్మెల్యేగా గెలిచావని, అలాంటిది సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీపై విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

సైదాపూర్: రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను విమర్శించే స్థాయి హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మ్యాకల రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పోరాటం చేసిన వ్యక్తి మంత్రి పొన్నం ప్రభాకర్ అని పేర్కొన్నారు.

కేంద్ర పథకాల కరపత్రాలు పంపిణీ

హుజూరాబాద్, మార్చి 24: హుజూరాబాద్ పట్టణంలోని 34,35,36వ బూతుల్లో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం లాబర్ది సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించి కేంద్రం అమలు చేస్తున్న పథకాల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గంగిశెట్టి రాజు, నల్ల సుమన్, పీఆర్ శ్రీనివాస్, కొలిపాక వెంకటేష్, రేపాక రాజు తదితరులు పాల్గొన్నారు.

రంగోలి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

హుజూరాబాద్, మార్చి 24: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రంగోలి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. తెలంగాణ కామర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ప్రేరణ కలిగించేందుకు వివిధ రకాల పోటీలను యూనివర్సిటీ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించారు. ఈ పోటీల్లో హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని శాతావాహన యూనివర్సిటీ స్థాయిలో బహుమతి సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయిలో జరిగిన రంగోలి పోటీల్లో పాల్గొని ప్రశంసా పత్రాన్ని సాధించారు. విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఇందిరాదేవి తదితరులు అభినందించారు.

గ్రామ కూడళ్లలో కామదహనం

ఇల్లందకుంట, మార్చి 24: మండలంలోని గ్రామ కూడలీల వద్ద వారం రోజుల నుంచి ఆడిన కోలలను కామదహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ప్రజలు, చిన్నారులు పాల్గొన్నారు. సోమవారం హోలీ వేడుకలు నిర్వహించేందుకు చిన్నారులు రంగులు సిద్ధం చేసుకుంటున్నారు.